కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

నిజాంపేట్ : కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ లేబర్ సెల్ కార్యదర్శిగా శరగడం నర్సింగరావు ఎన్నికైన సందర్భంగా మంగళవారం కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించారు. అలాగే కాంగ్రెస్ సేవాదళ్ బీ బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షులుగా మహ్మద్ అజమ్ ఎన్నికయ్యారు. కార్యక్రమలో అంజద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం



మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్

కుత్బుల్లాపూర్: వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ డివిజన్ విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రవికుమార్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో డీఈటీ శ్రీనాథ్‌రెడ్డి, డీఈలు జాన్‌పోతరాజు, లీలాప్రసాద్‌లతో కలిసి రెండు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీకాంత్, కొంపల్లి ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

కుత్బుల్లాపూర్: దోమలు వృద్ధి చెందకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎంటమాలజీ అధికారి ఉమారాణి అన్నారు. మంగళవారం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్సార్ నాయక్ నగర్, జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్‌లతో పాటు ఏసీఎం స్ప్రే చేశారు. ముఖ్యంగా కాలనీవాసులు ఇంటి ముందు ఉండే పూల మొక్కల్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రతిరోజు ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో సమస్యను పరిష్కరిస్తున్నామని, రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తరగుతులు ప్రారంభం



తరగతులను ప్రారంభించి పర్యవేక్షిస్తున్న ఎంఈఓ జెమినికుమార్

రంగారెడ్డినగర్: పాఠ్యాంశాలను మరింత సులభతరంగా అర్థమయ్యేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ దోహదపడుతుందని ఎంఈఓ జెమినికుమారి అన్నారు. మంగళవారం నెహ్రూనగర్ మండల ప్రజాపరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ రవీందర్ రాజు, ప్రధానోపాధ్యాయులు సుఖదేవ్, వేదవతి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సహకరించాలి

కుత్బుల్లాపూర్ : సుచిత్ర నుంచి కొంపల్లి వరకు జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు కోరారు. మంగళవారం కొంపల్లి ఫ్లైఓవర్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల వాహనదారులు కొంత ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమేనని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామన్నారు. డీమార్ట్ సమీపంలో జరుగుతున్న పనుల నేపథ్యంలో మూడు పిల్లర్ల అవతల యూటర్న్ ఏర్పాటు చేశామని, ఆయా కాలనీలకు వెళ్లే ప్రత్యామ్నాయ రోడ్లకు హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం

కుత్బుల్లాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన అంజిరెడ్డిని మంగళవారం బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.



"పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పైగా సమస్య పరిష్కరించాలని ప్రజలు నిరసనలు చేపట్టి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న ఫలితం లేకుండా పోయింది. పారిశ్రామిక వాడల నుంచి వచ్చే కాలుష్యంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు."

విషవాయువులతో

ఉక్కిరి బిక్కిరి

పారిశ్రామిక వాడల నుంచి వెలువడుతున్న కాలుష్యం

పట్టించుకోని అధికారులు



సమస్యపై మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రగతినగర్‌లో ఎలీఫ్ పారిశ్రామిక వాడ నుంచి వెలువడుతున్న వాయువులు(ఫైల్)

నిజాంపేట్: గడ్డ పోతారం, ఐడీఏ బొల్లారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలతో గాజులరామారంలోని ఎలీఫ్ పారిశ్రామిక వాడ, అదే విధంగా జీడిమెట్ల లాంటి ప్రాంతాల నుంచి ప్రతి నిత్యం విష వాయువులు వెలువడుతున్నాయి. వాతావరణంలోకి వదులుతుండటంతో విష వాయువులను పీల్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం శాసన మండలిలో శంభీపూర్ రాజు సైతం ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

అర్ధరాత్రి, తెల్లవారుజామున..

వివిధ పరిశ్రమల నుంచి అర్ధరాత్రి, తెల్లవారుజామున ఈ విష వాయువులను గాలిలోకి వదులుతున్నారు. ఈ సమయంలో ప్రజలు పెద్దగా గుర్తించరని పరిశ్రమల నిర్వాహకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. అదే విధంగా వ్యర్థ జలాలను సైతం బయటకు వదులుతుండటంతో ఈ కెమికల్ వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విష వాయువులతో ఘాటైన వాసనాలు రావడంతో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం సదరు పరిశ్రమలను గుర్తించడంలో విఫలమవుతున్నారు.

వెల్లువెత్తుతున్న నిరసనలు

వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులను అరికట్టాలని, పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇటీవలే కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావుల ఆధ్వర్యంలో బాచుపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. ప్రగతినగర్‌లోని ఎలీఫ్ పారిశ్రామిక వాడ ప్రజలు ఎలీఫ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.

పట్టించుకోని అధికారులు

కాలుష్యం నుంచి తమను కాపాడాలని ప్రజలు అనేక సార్లు అధికారులు ఫిర్యాదు చేశారు. అయినా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఫిర్యాదు చేసిన సమయంలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

స్పెషల్ టీం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్సీ



నియోజకవర్గంలోని కాలుష్యంపై శాసన మండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడారు. పారిశ్రామిక వాడల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు స్పెషల్ టీంలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు వాయు, నీటి కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు పీసీబీ అధికారులతో మాట్లాడిన చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వాడల దగ్గరలో ఎక్కడ బోరు వేసినా రసాయన జలాలు వస్తున్నాయన్నారు. సకాలంలో నియంత్రించకుంటే హైదరాబాద్‌లో కాలుష్యం మరింత పెరిగిపోయే ప్రమాదముందన్నారు. ఖాజీపల్లి, గడ్డపోతారం, జీడిమెట్ల, ఐడీఏ బొల్లారం ప్రాంతాలపై పీసీబీ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



ప్రగతినగర్ ఎలీఫ్ పారిశ్రామిక వాడ నుంచి వెలువడుతున్న విషవాయువులను నియంత్రించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఫిర్యాదు ఇచ్చినప్పట్లో కొద్దిగా నియంత్రణ ఉన్నట్లు ఉంటుంది. తరువాత పరిస్థితి అలాగే ఉంటుంది. ఈ సమస్యపై ఆందోళన సైతం చేసినా అధికారుల్లో స్పందన లేదు. – శివకుమార్, ప్రగతినగర్



బాచుపల్లిలో కాలుష్యంపై నిరసన తెలుపుతున్న స్థానికులు(ఫైల్)

కన్జర్వేషన్ జోన్ తీసివేయాలి



లేఖలు అందజేస్తున్న రైతులు

దుండిగల్: రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కన్జర్వేషన్ జోన్ తీసివేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధి బౌరంపేటలోని భూములకు కన్జర్వేషన్ జోన్ తీసివేయాలని కోరుతూ రైతులు సీఎం రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జోన్‌లను ఏర్పాటు చేశారని, అప్పుడు రైతులకు వ్యతిరేకంగా జోన్ల నిర్ధారణ జరిగిందన్నారు. రైతుల పొలాల పక్కనే ఉన్న జోన్‌లో లేని బడా సంస్థలు పెద్ద పెద్ద హై రైస్ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తుంటే కన్జర్వేషన్ జోన్ రైతులు వాటిని చూసి బిత్తరపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అమ్ముకుంటే ధర రాక, భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వక, ప్రభుత్వం నుంచి పరిహారం అందక ఆవేదన చెందుతున్నారన్నారు. బౌరంపేట్ సహా అన్ని గ్రామాలు ఆర్ 1 జోన్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కన్జర్వేషన్ జోన్ తీసేయడానికి సుమారు 160 మంది రైతులు లేఖలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్, నల్ల రామచంద్రా రెడ్డి, ఏ మల్లేష్ యాదవ్, సర్గారి సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగారెడ్డి, డి ప్రభాకర్ రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

నీటి అక్రమ కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్



అక్రమ కనెక్షన్‌ను తొలగిస్తున్న విజిలెన్స్ సీఐ సురేష్ తదితరులు

రంగారెడ్డినగర్: అక్రమ కనెక్షన్లను కలిగి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని వాటర్ వర్క్స్ విజిలెన్స్ సీఐ సురేష్ అన్నారు. అక్రమ కనెక్షన్లపై ఫిర్యాదులు అందడంతో జగద్గిరిగుట్ట సెక్షన్ పరిధి లోని అంజయ్య నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శివ ప్రకాష్ గృహానికి రెండు 15 ఎంఎం నీటి కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో ఒకటి మాత్ర మే జలమండలి నుంచి అప్రూవల్ తీసుకోగా మరో 15 ఎంఎం కనెక్షన్‌ను అక్రమ కనెక్షన్ ఏర్పాటు చేసు కొని నీటిని ఉపయోగించుకుంటున్నాడు. ఇది గమనించిన విజిలెన్స్ సిబ్బంది స్థానిక సెక్షన్ మేనేజర్ మహేష్‌కు సమాచారం అందించడంతో విజిలెన్స్ సీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జలమండలి సెక్షన్ల కింద కేసునమోదు చేశారు.

అదనపు అంతస్తుల కూల్చివేత

నిజాంపేట్ : మున్సిపల్ కార్పొరేషన్ సింహపురి కాలనీలో అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులను మంగళవారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ ఏసీపీ జ్యోత్స్న మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ, అదనపు నిర్మాణాలను ఉపేక్షించేది లేదని అన్నారు. కొనుగోలుదారులు నష్టపోవద్దని సూచించారు. అలాంటి భవనాలను కూల్చడం తప్పదన్నారు.

యువకుడి అదృశ్యం



రాహుల్(ఫైల్)

సుభాష్‌నగర్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం లక్ష్మీనగర్‌కు చెందిన రాహుల్ (19) ఈ నెల 17 రాత్రి నుంచి కనిపించలేదు. అతని మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీంతో ఆందోళన చెందిన యువకుడి తల్లి మంగళవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆర్థికసాయం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌కు చెందిన బస్తీ సీనియర్ నాయకుడు మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో ఇంటికి పరిమితయ్యారు. విషయం తెలుసుకున్న సామాజికవేత్త ఉదయ్ మంగళవారం తన మిత్ర బృందంతో కలిసి పరామర్శించారు. రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కొండా శ్రీకాంత్, నరేందర్, యశ్వంత్, జనార్దన్, క్రాంతి, శరత్, ప్రదీప్, తిరుపతి, సుశాంత్ తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు సమాంతరంగా మట్టి



జీడిమెట్ల: జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ చొరవతో పోలీస్ స్టేషన్ ముందు రోడ్డు సమాంతరంగా అయ్యింది. జీడిమెట్ల పీఎస్ ముందు ఉన్న బీటీ రోడ్డు కిందిభాగం ఎత్తు తగ్గులుగా ఉండటంతో కొంతమంది ద్విచక్ర వాహనదారులు కిందపడుతున్నారు. గమనించిన సీఐ సోమవారం రాత్రి టిప్పర్లతో మట్టిని తెప్పించి జేసీబీతో బీటీ రోడ్డుకు సమాంతరంగా చేయించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

నోటీసుల జారీపై ఆగ్రహం

ఉప కమిషనర్ నరసింహతో సమావేశం

కుత్బుల్లాపూర్ : అంబేద్కర్ నగర్ ప్రాంతంలో 24 మందికి అధికంగా పన్నులు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంపై సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహతో కాలనీ వాసులు సమావేశం అయ్యారు. కాలనీ మొత్తం మీద తమకే ఎందుకు అధిక పన్నులు చెల్లించాలని నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. రోజువారీ పనులు చేసుకునే తమకు భారీ ఎత్తున పన్నులు చెల్లించాలని 60 గజాలు 80 గజాలు 100 గజాలకు రూ.20వేల నుంచి 50 వేల వరకు టాక్స్ పెంచడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము పన్నులు చెల్లించే పరిస్థితిలో లేమని దీనికి ప్రత్యేక ఏర్పాట్లు చూపాలని కోరగా.. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ వారికి సర్ది చెప్పి 2024 సంవత్సరానికి సంబంధించిన పన్నులు చెల్లించి 90 శాతం ఫైన్ మినహాయింపు పొందాలని సూచించారు. బుధవారం కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని ఉప కమిషనర్ హామీ ఇచ్చారు.

యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

–మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గత ప్రభుత్వంలో శంకుస్థాపనలకే అభివృద్ధి పనులు పరిమితమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులతో పాటు కొత్త వాటిని యుద్ధ ప్రాతిపదికన చేపడుతోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రోడామేస్త్రీనగర్(బి)లో రూ. 55 లక్షలు, సుభాష్ చంద్రబోస్‌నగర్(బి)లో రూ. 60 లక్షల నిధులు సీసీ రోడ్డు కోసం మంజూరయ్యాయి. దీంతో మంగళవారం ఆయన స్థానికంగా పర్యటించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా దూసుకుపోతుందన్నారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను జిలా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఆరీఫ్, జహంగీర్, హుస్సేన్, ఆంజనేయులు, నవీన్, బలరామ్, యాదగిరి, కొండయ్య, గుండమ్మ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ చాంబర్లపై వ్యాపారాలు చేయొద్దు

కథనానికి కదిలిన అధికారులు



అక్రమ వ్యాపార కేంద్రాలను తొలగించాలని ఆదేశిస్తున్న వాటర్ వర్క్స్ జ్ఞానేందర్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

చింతల్: పైపులైన్ చాంబర్లపై నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వారిని ఉపేక్షించేది లేదని జలమండలి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్ రెడ్డి హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం షాపూర్ నగర్ సబ్ డివిజన్ పరిధిలోని 1000/800 ఎం.ఎం పైపులైన్ చాంబర్‌పై నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారంపై ఈ నెల 5న సాక్షిలో 'పైపులైన్ చాంబర్లపై యదేచ్ఛగా వ్యాపారాలు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్‌రెడ్డి, సీఐ సురేష్ మంగళవారం షాపూర్ నగర్‌లోని తిరుమల బేకరీ ఎదురుగా 50 గజాలలో ఉన్న పైపులైన్ చాంబర్‌ను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారం చేస్తూ కలుషిత జలాలకు కారణమవుతున్న మిర్చి బండి, చైనీస్ ఫాస్ట్ ఫుడ్, జిలేబి బండి, చెరుకు బండి తదితర వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. బుధవారం నుంచి ఈ పైపులైన్ చాంబర్ పై ఎటువంటి వ్యాపారాలు, తినుబండారాల అమ్మకాలు కొనసాగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా జలమండలి పరిధిలోకి వచ్చే ట్రాన్స్‌మిషన్ పైపులైనులతో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్‌పై ఎటువంటి వ్యాపారాలు ఏర్పాటు చేయవద్దన్నారు.

ఘనంగా పెంచల్‌రెడ్డి 28వ వర్ధంతి



నివాళులర్పిస్తున్న కాలనీ వాసులు

చింతల్: భగత్‌సింగ్ నగర్ వ్యవస్థాపకుడు, దివంగత యలమూరి పెంచల్‌రెడ్డి 28వ వర్ధంతిని మంగళవారం భగత్‌సింగ్ నగర్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి, భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు గూడు కల్పించిన మహోన్నత వ్యక్తి పెంచల్‌రెడ్డి అని, ఆనాడు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు చేసి ఇళ్లను సాధించారన్నారు. కార్యక్రమంలో దళిత చైతన్య కళామండలి అధ్యక్షుడు నిషాని చందర్, భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జెల్లా వెంకటేష్, జనార్దన్‌రెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, మజ్జారి శ్రీనివాస్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చాలి

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఎస్సీ సామాజికవర్గానికి ప్రయోజనం చేకూరేలా అధికారులు అవగాహన కల్పించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ వీసీహాల్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీలేని రుణాల పథకాలు ఎస్సీవర్గాలకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ ద్వారా స్వయం ఉపాధికి సంబంధించిన చిన్న కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక యువతను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన సరుకులు, భోజనంపై సభ్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్కాలర్‌షిప్స్ తదితర విషయాలపై చర్చించి అడ్మిషన్‌లకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌కు సూచించారు. అట్రాసిటి కేసుల్లో జాప్యం కలగకుండా సంబంధిత తహసీల్దార్ ధ్రువీకరణపత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు.

- ఎస్సీలకు అందించే వివరాల శాతాల జాబితాను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌గౌతమ్ ఆయనకు వివరించారు. పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌లను సత్కరించారు. డీసీపీలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం



హైకోర్టు ఆర్డర్ కాపీని చూపిస్తున్న మాజీ సర్పంచ్ సుజాత శ్రీహరి

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలోని కమ్మ సేవా సంఘం ఫంక్షన్ హాల్‌పై విచారణ జరిపి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. మంగళవారం బహదూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్ శివనూరి సుజాత శ్రీహరి మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న సర్వే నంబర్ 227 లోని 355 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని, ఇందులో వెంచర్ చేయడంపై 2004లో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఏది ఏమైనా సదరు ప్రభుత్వ స్థలం ప్రైవేట్ వ్యక్తుల పాలు కాకుండా పోరాడుతామని తెలిపారు.

డీసీఎం డ్రైవర్ అదృశ్యం



బబన్(ఫైల్)

సుభాష్‌నగర్: డ్యూటీకని వెళ్లిన డీసీఎం డ్రైవర్ అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం మరాటీ బస్తీకి చెందిన బబన్ (48) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన డ్యూటీకని వెళ్లి నేటి వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు డీసీఎం ఓనర్‌ను సంప్రదించగా .. అతను డ్యూటీకి రాలేదని బదులిచ్చాడు. దీంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. అతని కుమారుడు శుభం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులు.. కేసు నమోదు

కుత్బుల్లాపూర్: తన కుమారుడిని పిలిపించి కొట్టారని తల్లి, డబ్బులు తీసుకుని తప్పించుకొని తిరుగుతున్నాడని నిందితుడు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కల్యాణి అనే మహిళ తన కుమారుడు యశ్వంత్‌ను శ్రీనాథ్‌రెడ్డి, అతని స్నేహితులు పేట్‌బషీరాబాద్‌లోని వైన్స్ దుకాణం వద్దకు పిలిపించి కొట్టారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈవెంట్ విషయమై యశ్వంత్ తమ వద్ద రూ. 5 లక్షల తీసుకుని మోసం చేశాడని, డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని శ్రీనాథ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.